తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 126 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ గురువారం 5 -12-2024 వెల: 5/రూ -

### పోలవరం భూసేకరణ, పునరావాసం
# బకాయిలు విడుదల



**భూసేకరణల కోసం ప్రభుత్వం రూ. 996 కోట్లను విడుదల**

**డిసెంబర్ రెండో వారంలో చంద్రబాబు పర్యటన**


అమరావతి,డిసెంబర్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన పునరావాసం, పరిహారం, భూసేకరణల కోసం ప్రభుత్వం రూ. 996 కోట్లను విడుదల చేసింది. 2026నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఒక యజ్ఞంలా, 2027 నాటికి నిర్మాణం పూర్తి చేసేలా సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి నిమ్మల తెలిపారు. డిసెంబర్ రెండోవారంలో ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. అదేరోజు పోలవరం నిర్మాణానికి సంబంధించిన టైమ్ షెడ్యూల్ ను కూడా విడుదల చేయనున్నారు.

2లో



# కల్యాణ శోభితం

2లో



## ఏపీ విద్యార్థులకు గుడ్‌న్యూస్

అమరావతి: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది.

2లో

### హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ
# ఇంజనీరింగ్ సెంటర్




**నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, సైబర్ సేఫ్టీలో కీలకపాత్ర**

**సీఎం రేవంత్‌తో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ భేటీ**

**'జీఎస్ఈసీ' ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం**

**హైదరాబాద్ ఐటీ, ఇన్నోవేషన్ హబ్ అవుతుందన్న సీఎం**

హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటి 'గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ (జీఎస్ఈసీ)' హైదరాబాద్‌లో ఏర్పాటుకానుంది. ఈ మేరకు గూగుల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న ఈ 'గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్'మొత్తంగా ఐదోదికాగా.. ఆసియా పసిఫిక్ జోన్‌లో టోక్యో తర్వాత ఇదే రెండో సెంటర్ కావడం గమనార్హం.




# వణికించిన భూకంపం

**రాష్ట్రంలో 5.3 తీవ్రతతో కంపించిన భూమి.. ఉదయం 7.27కు ప్రకంపనలు**

**3 నుంచి 7 సెకన్ల వరకు ప్రభావం.. మేడారంలో 40 కి.మీ. లోతులో కేంద్రం**

**హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలపై ప్రభావం**

**ఏపీలోనూ పలు ప్రాంతాల్లో ప్రకంపనలు**

**భయంతో ఇళ్ల నుంచి ప్రజల పరుగులు**

**నేను కూడా ఆందోళనతో బయటకొచ్చా ములుగు కలెక్టర్ దివాకర**

**వారంపాటు తదనంతర ప్రకంపనలు!**

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భూమి కంపించింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత 5 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 7.27 గంటల సమయంలో ములుగులోని మేడారం కేంద్రంగా 3-7 సెకన్ల పాటు కొనసాగిన ప్రకంపనలతో కొన్ని చోట్ల ఇళ్ల గోడలు, నేల బీటలువారాయి. జనం భయంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భూమి కంపించింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత 5 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 7.27 గంటల సమయంలో ములుగులోని మేడారం కేంద్రంగా 3-7 సెకన్ల పాటు కొనసాగిన ప్రకంపనలతో కొన్ని చోట్ల ఇళ్ల గోడలు, నేల బీటలువారాయి. జనం భయంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వాహనాలపై వెళుతున్నవారు ఏం జరుగుతోందో తెలియక కంగారుపడ్డారు.

2లో



## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్

బీజేపీఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక

నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం

డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్‌పవార్

### అబద్ధానికి అంగీలాగు వేస్తే
# అది రేవంత్‌రెడ్డి

**తొమ్మిదిన్నరేండ్లలో 4,26,499 కోట్లు అప్పు చేస్తే**

- 7 లక్షల కోట్లని గోబెల్స్ సిగ్గుపడేలా అబద్ధాలు
- నాడు 74 శాతం అభివృద్ధి పనులకే ఖర్చు పెట్టినం
- 5,944 కోట్ల మిగులుతో రాష్ట్రాన్ని అప్పజెప్పినం
- కేవలం 11 నెలల్లో లక్ష కోట్ల అప్పు చేసింద్రు
- 60 ఏండ్ల అప్పును ఏడాదిలోనే దాటిన రేవంత్
- ఒక హామీ నెరవేర్చకుండా, కొత్త ప్రాజెక్టేదీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీత




హైదరాబాద్: 'రేవంత్‌రెడ్డీ.. అప్పుల లెక్కలు కాదు.. హామీల లెకలు చెప్పు! వడ్డీల ముచ్చట్లు కాదు.. వాగ్దానాల ముచ్చట్లు చెప్పు! అప్పులపై అబద్ధాలాడటం కాదు.. దమ్ముంటే నీ అసమర్థ పాలనపై శ్వేతపత్రం విడుదల చెయ్యి!' అని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. తాము తొమ్మిదిన్నరేండ్లలో రూ.4,26,499 కోట్ల అప్పు చేస్తే రూ.7 లక్షల కోట్లు అని గ్లోబెల్స్ కూడా సిగ్గుపడేలా రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధి పనుల మూలధన వ్యయానికే 74 శాతం నిధులు ఖర్చు చేసిందని,

2లో



## ప్రజల గొంతుకగా ప్రశ్నిద్దాం: వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- ఇంతటి వ్యతిరేకత ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు
- సూపర్ సిక్స్, సూపర్ సెవెన్.. గాలికెగిరిపోయాయి
- చెప్పిన అబద్ధాలు, చేసిన మోసాలు ప్రజల్లో కోపంగా మారాయి..
- ప్రజలు ప్రశ్నించే పరిస్థితి వచ్చింది
- రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారు
- అయినా నిరసన వ్యక్తం చేసే పరిస్థితి లేదు
- ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు

2లో

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్



గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో భేటీ అయింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు.

**అమెరికా పర్యటనలో సంప్రదింపుల నేపథ్యంలో..**

ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సీఎం రేవంత్.. సంస్థ ప్రతినిధులతో జరిపిన సంప్రదింపుల నేపథ్యంలో జీఎస్ఈసీ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం కార్యాలయం వెల్లడించింది. అక్టోబర్ 3న జరిగిన 'గూగుల్ ఫర్ ఇండియా%-%2024' సదస్సులో జీఎస్ఈసీ ఏర్పాటుపై గూగుల్ కీలక ప్రకటన చేసిందని... పలు రాష్ట్రాలు పోటీపడినా హైదరాబాద్‌లో ఏర్పాటుకే గూగుల్ సంస్థ మొగ్గు చూపిందని తెలిపింది. అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్‌గా పనిచేసే జీఎస్ఈసీ.. అధునాతన ఆన్‌లైన్ భద్రత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని వెల్లడించింది. ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్: సీఎం రేవంత్‌గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ ముందుకు రావడంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ అగ్రభాగాన ఉందని ఈ సందర్భంగా గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ హాన్సెన్ వ్యాఖ్యానించారు.

జీఎస్ఈసీ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సెంటర్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

# పోలవరం భూసేకరణ, పునరావాసం బకాయిలు విడుదల

షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఒక రోజు గానీ, ఒక గంట గానీ వృథా కాకూడదని సీఎం చెప్పారని మంత్రి వివరించారు. 10 రోజుల్లో మరింత క్లారిటీ తీసుకుని షెడ్యూల్ తయారు చేయడం జరుగుతుందన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు సంబంధించిన రూ.996 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేసేందుకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో పోలవరం ప్రాజెక్టు 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని మంత్రి వివరించారు. పోలవరం విషయంలో అంతర్రాష్ట్ర సమస్యలకు సంబంధించి చత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్రాలతో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని కచ్చితంగా పోలవరం ఫలాలు రాయలసీమ, ఉత్తరాంధ్రలకు కూడా అందిస్తామన్నారు. రాయలసీమకు లైఫ్ లైన్ వంటి హంద్రీ-నీవా ప్రాజెక్టును గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.5 కూడా కేటాయించలేదని ఆరోపించారు. హంద్రీ-నీవాను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ నెలలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాల్వ విస్తరణ, లైనింగ్ పనులు మొదలుపెడతామన్నారు. డిసెంబర్-జనవరి నెలల్లో హంద్రీ-నీవా పనులు ప్రారంభిస్తారు. 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించే బహుళార్థక ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్ట్ కు రూ.73 కోట్ల పెనాల్టీ విధించారని గుర్తు చేశారు. 3 నెలల్లో అనుమతులు తీసుకోవాలని చెప్పినా, పట్టించుకోకపోవడంతో 3 సంవత్సరాలు ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో చింతలపూడి ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసేశారన్నారు. ప్రాజెక్టుల విషయంలో గత ఐదేళ్లు పాలకులు మొద్దు నిద్రపోయారని, అవాస్తవాలు-అసత్యాలు వెల్లడించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించి వాస్తవ పరిస్థితిని సమీక్షించారని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.3 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి తీసుకొచ్చారన్నారు. 2024 ఎన్నికల సమయంలో రైతులను కూడా దగ్గరకు రానీయకుండా ప్రాజెక్టును అంకితం చేస్తున్నామని అసత్య ప్రచారాలు చేశారన్నారు. 2026 జూన్ కల్లా వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు తీసుకొచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

# కల్యాణ శోభితం

(మొదటి పేజీ తరువాయి)

అక్కినేని వారి ఇల్లు కల్యాణకాంతులతో వెలుగులీనింది. నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహబంధంలోకి అడుగుపెట్టారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వీరిద్దరి పెళ్లి వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు చిరంజీవి, సుబ్బిరామిరెడ్డి, హీరో కార్తి, రామ్‌చరణ్, రానా, నాని, కీరవాణితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. 'చైతన్య, శోభిత తమ జీవితంలో అందమైన అధ్యాయాన్ని మొదలుపెట్టారు. నాకిది భావోద్వేగభరితమైన క్షణం. శోభితను మా అక్కినేని కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. నాన్న ఏఎన్నార్ శతజయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహం ముందు ఈ పెళ్లి వేడుక జరగడం గొప్ప సంతోషాన్నిస్తోంది' అని నాగార్జున తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# ఏపీ విద్యార్థులకు గుడ్‌న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం ప్రవేశపెట్టనుంది. ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలని ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. పండుగ వాతావరణంలో మెగా పీటీఎం నిర్వహించనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనల మేరకు నైతిక విలువలపై పాఠ్యాంశాలు చెప్పనుంది. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యపై మంత్రి లోకేష్ ఇవాళ(మంగళవారం) ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే వారు దాదాపుగా అందరూ పేద విద్యార్థులే. వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. అయితే వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మంత్రి నారా లోకేష్ మధ్యాహ్న భోజన పథకంపై కీలక ప్రకటన చేశారు. పాఠశాలలకు అందిస్తున్న విధంగానే ఇంటర్ చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వమే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుందని మంత్రి లోకేష్ తెలిపారు.

# అబద్ధానికి అంగీలాగు వేస్తే అది రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తద్వారా వనరులు పెరిగి ప్రజల ఆదాయం పెరిగిందని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆదాయం మొత్తం అప్పులకే పోతుందని రేవంత్‌రెడ్డి చెప్పడం దారుణమని, రూ.100లో అప్పులకు, వడ్డీకి రూ.47 మాత్రమే చెల్లిస్తున్నారని స్పష్టంచేశారు. 2014లో రూ.364 కోట్ల ఆర్థిక మిగులు ఉంటే, 2023 నాటికి రూ.5,944 కోట్లతో రాష్ట్రాన్ని అప్పగించామని, దేశంలోనే టాప్-2లో ఉంచామని గుర్తుచేశారు. అప్పుల పేరుతో ఇంకెవరైనా తప్పుడు కూతలు కూస్తే బడ్జెట్‌పై అవగాహన లేనట్టేనని స్పష్టంచేశారు. కేవలం 11 నెలల్లో సుమారు రూ.లక్ష కోట్లకు పైగా అప్పు చేసిన రేవంత్‌రెడ్డి ఆ డబ్బును ఏం చేశారని నిలదీశారు. ప్రతి నెలా రూ.6,500 కోట్లు వడ్డీల కింద చెల్లిస్తున్నామని చెప్పడం కూడా అబద్ధమేనని, కాగ్ రిపోర్ట్ ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ నాటికి కట్టింది రూ.15,152 కోట్లేనని స్పష్టంచేశారు. 'ఒక హామీని నెరవేర్చకుండా, ఒక ప్రాజెక్టు కూడా కట్టకుండా తెలంగాణ ఆదా యం ఎటుపోతున్నట్టు? ఎనుముల బ్రదర్స్ జేబుల్లోకి వెళ్తోందా? ఢిల్లీ పెద్దల ఖజానా నిండుతున్నదా?' అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాదిలో రాష్ట్రం అధోగతి పాలైందని, ప్రజలు తిప్పల పాలయ్యారని మండిపడ్డారు.

# ప్రజల గొంతుకగా ప్రశ్నిద్దాం: వైఎస్ జగన్

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలను తుంగలో తొక్కి.. అన్ని వర్గాలనూ దగా చేస్తున్న చంద్రబాబునాయుడి ప్రభుత్వంపై ఆరు నెలల్లోనే ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత పెల్లుబుకుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. కనీస మద్దతు ధర దక్కక రైతులు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు.. కరెంటు ఛార్జీల బాదుడుతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ మోసాలు, అక్రమాలు, వైఫల్యాలపై ప్రశ్నించే స్వరం వినిపించకూడదనే దురాలోచనలతో అక్రమ కేసులు పెడుతూ అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడి, వారి తరఫున కూటమి ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఆ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

# వణికించిన భూకంపం




(మొదటి పేజీ తరువాయి)

ఉదయం వాహ్యాళికి వెళ్లినవారు ఉలిక్కిపడ్డారు. మేడారం వద్ద భూమిలో 40 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలంగాణ విపత్తు నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తెలిపారు. భూకంప తీవ్రత 5.3గా నమోదైనట్లు వివరించారు. ఎక్కువ లోతులో భూకంపం రావడం వల్ల.. ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదు. అయితే.. భూకంప ప్రభావం 225 కిలోమీటర్ల వరకు కనిపించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మొదలు.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ, ఏలూరు, విశాఖపట్నం వరకు భూప్రకంపనలు నమోదయ్యాయి. మూడు దశాబ్దాల(1969లో 5.7 తీవ్రత) తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఇదే పెద్ద భూకంపమని, వారం రోజుల వరకు భూకంప తదనంతర ప్రకంపనల ముప్పు పొంచి ఉండవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అయితే.. తెలంగాణ రాష్ట్రం జోన్-3, 2ల్లో ఉన్నందున పెద్దగా ప్రమాదం ఉండదని చెబుతున్నారు.

**సీసీ కెమెరాల్లో దృశ్యాలు..**

భూకంప ప్రభావం గోదావరి పరీవాహక ప్రాంతాలపై ఎక్కువగా కనిపించింది. ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, వరంగల్, హనుమకొండ, ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్‌తోపాటు.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలపై కనిపించింది. ములుగులో.. ముఖ్యంగా మేడారం పరిసరాల్లో భూకంపానికి ముందు కుక్కలు అసాధారణంగా అరిచాయని, పక్షులు అరుస్తూ కల్లోలంగా తిరిగాయని స్థానికులు తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మల గద్దెల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో భూమి కంపించిన దృశ్యాలు స్పష్టంగా నమోదయ్యాయి. కొంతసేపు అసలేంజరుగుతుందో అర్థంకాలేదని.. ఒక్కసారిగా భూమి కంపించడం తో భయమేసిందని సమ్మక్క పూజారి సిద్దబోయిన ఆనం ద్, సారలమ్మ పూజారి కాక కిరణ్ తెలిపారు. కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వరావుపేట వంటి ప్రాంతాల్లోనూ భూమి కంపించిన దృశ్యాలు సీసీ టీవీల్లో రికార్డయ్యాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో దాదాపు మీటర్ లోతు గొయ్యి ఏర్పడిందని, ఇళ్లలోని పాత్రలు కిందపడ్డాయని, కొన్ని ఇళ్లకు బీటలు వచ్చాయని స్థానికులు పేర్కొన్నారు. హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో ఓ భవనం రెయిలింగ్ కూలింది. వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేశాయ్ వివరించారు. భూకంపం తర్వాత పైకప్పుపై తనిఖీలు చేశామన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన సమయంలో సాండ్‌బాక్స్ టెక్నాలజీలో పునాదులను నిర్మించినా.. పకడ్బందీగా ఉండేలా అదనపు ఏర్పాట్లు చేశామన్నారు.


**భూకంపానికి కారణాలేమిటి?**

మేడారం-ఐలాపూర్ అడవుల్లో భూకంపం రావడానికి కారణాలేమిటనే కోణంపై జియాలజిస్టులు దృష్టిసారించారు. కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంతంలో టోర్నడోల్లాంటి ఈదురుగాలులకు 500 ఎకరాల్లోని లక్షకు పైగా చెట్లు నేలకొరిగిన విషయం తెలిసిందే..! భూకంపానికి ఇది సంకేతమా? అనే అనుమానాలు వ్యక్తమైనా.. ఆ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని జియాలజిస్టులు తెలిపారు. మేడారం-ఐలాపూర్ అడవులు గోదావరి పరీవాహకంలో ఉండడమే భూకంపానికి కారణమని అంచనా వేస్తున్నారు.

**గోదావరి పరీవాహకాల్లో ముప్పు! డేంజర్ జోన్‌లోనే భద్రాద్రి**

తెలంగాణలో కేవలం గోదావరి పరీవాహకాల నుంచి భూకంపాలు వచ్చే ముప్పు ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ భూభౌతిక శాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ జి.రాందాసు తెలిపారు. 1872, నవంబరు 22న సిరోంచాలో 5.0 తీవ్రతతో.. 1969లో భద్రాచలంలో 5.7 తీవ్రతతో భూకంపాలు నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. "ఈ ప్రాంతాల్లో వచ్చిన భూకంపాలు భద్రాద్రికి తూర్పు దిశలో కేంద్రాలుండేవి. ఈసారి మాత్రం పశ్చిమ దిశలో భూకంప కేంద్రం ఉంది. సాంకేతికంగా చూస్తే.. ఇది ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది..! గోదావరి భూగర్భంలో రెండు ఫలకాలు ఉంటాయి. ఒకటి ఆదిలాబాద్ జిల్లా కడెం ప్రాజెక్టు కింద ఉంటే.. రెండోది కిన్నెరసాని ప్రాజెక్టు కింద ఉంటుంది. ఈ రెండూ భద్రాద్రి వద్ద కలుస్తాయని భావిస్తుంటారు. బస్తర్ ఫలకం ముందుకు-వెనక్కి కదులుతుండడం వల్ల శక్తి విడుదలవుతుంది. ఆ సమయంలో ఎటువైపు ఖాళీ ఏర్పడితే.. ఆ ప్రాంతంలో భూకంపం సంభవిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో మానవ తప్పిదాలతోపాటు.. ప్రకృతి ప్రకోపం కూడా భూకంపాలకు కారణంగా చెప్పవచ్చు. కడెంలోనూ పిల్లర్ కుంగే అవకాశాలున్నాయి. అప్పట్లో భూగర్భ సర్వే చేయలేదని ప్రభుత్వమే పేర్కొంది. దీనిపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉంది" అని ఆయన వివరించారు.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్



(మొదటి పేజీ తరువాయి)

ముంబై, డిసెంబర్ 4: మహారాష్ట్రలో పది రోజుల ఉత్కంఠకు తెరపడింది. కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్(54) పేరు ఖరారైంది. ఈ మేరకు బీజేపీ అధిష్ఠానం ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. దీంతో బుధవారం విధాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఆయనను బీజేపీ ఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కానున్నారని, మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతున్నట్టు బీజేపీ పరిశీలకులు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, విజయ్ రూపాని ప్రకటించారు. దీంతో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ సిండే, అజిత్ పవార్ నేతృత్వంలోని మహాయుతి ప్రతినిధి బృందం బుధవారం సాయంత్రం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరింది. గురువారం సాయంత్రం 5.30 గంటలకు దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

ఉప ముఖ్యమంత్రులుగా షిండే, పవార్

ఫడ్నవీస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రులుగా శివసేన నేత, మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు మొదట షిండే మొండికేశారు. ఆయనను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా బీజేపీ అధిష్ఠానం, ఫడ్నవీస్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదు. చివరకు బుధవారం సాయంత్రం అంగీకరించిన షిండే.. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు.

కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు..

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తున్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ తండ్రి గంగాధర్ ఫడ్నవీస్ జనసంఘ్, బీజేపీలో చురుగ్గా పని చేశారు. 1989లో ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించిన ఫడ్నవీస్ 22 ఏండ్ల వయసులోనే నాగ్‌పూర్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 1997లో 27 ఏండ్లకే మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1999 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చిన ఆయన 2014లో మొదటిసారి మహారాష్ట్ర సీఎం అయ్యారు. 2019 నవంబర్ 23న రెండోసారి సీఎంగా ప్రమాణం చేసినా, సరిపడా శాసనసభ్యుల బలం లేకపోవడంతో మూడు రోజులకే రాజీనామా చేశారు. 2022 జూన్‌లో శివసేనలో షిండే తిరుగుబాటు చేసి సీఎం అయిన తర్వాత, ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ముద్రించిన ఆహ్వానపత్రికల్లో ఫడ్నవీస్ పేరులో మార్పు కనిపించింది. ఇప్పటివరకు ఆయన పేరు దేవేంద్ర గంగాధర్ ఫడ్నవీస్ అని ఉండేది. ఫడ్నవీస్ తండ్రి గంగాధర్. ఎన్నికల అఫిడవిట్‌లలోనూ, గతంలో ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఫడ్నవీస్ ఇదే పేరుతో చేశారు. ఈసారి మాత్రం ఆయన పేరును 'దేవేంద్ర సరిత గంగాధర్‌రావు ఫడ్నవీస్'గా ముద్రించారు.

# రాధాక్రిష్ణ మెమోరియల్ స్కూల్ ను విజిట్ చేసిన రాయికోడ్ యం. ఈ ఓ అంజయ్య

### పాఠ్యంతర కార్యకలాపాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కష్టపడి బోధించాలి: ఏం, ఈ, ఓ అంజయ్య

### విద్యార్థుల ప్రతిభను పువ్వులాగా వికశించేలా చెయ్యాలి: ఏం, ఈ, ఓ అంజయ్య

### విద్యార్థులు క్రమశిక్షణకు కట్టుబడి ఉండేలా ఉపాధ్యాయులు నిర్ధారించుకోవాలి

### విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలి: ఏం, ఈ, ఓ అంజయ్య





**రాయికోడ్ డిసెంబర్,4 డైలీ రిపోర్ట్:** రాయికోడ్ మండల కేంద్రంలోని రాధాకృష్ణ మెమోరియల్ స్కూల్ ను బుధవారం రోజున రాయికోడ్ మండల యం, ఈ, ఓ అంజయ్య సందర్శించడం జరిగింది. అనంతరం యం, ఈ , ఓ అంజయ్య మాట్లాడుతూ ప్రతి నెల పిల్లల తండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు.భద్రత, ఆరోగ్య పరిశుభ్రత కమిటీల ఆధ్వర్యములో విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు , ఇంటర్నెట్ కు బానిసలు కాకుండా అవగాహన కల్పించాలన్నారు.నియమ నిబంధనలకు లోబడి ఫీజులు ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితిలో పాఠశాలలో పుస్తకాలు,నోటు పుస్తకాలు,యూనిఫాం విక్రహించవద్దని స్పష్టం చేశారు.స్కూల్ బస్సులు భద్రత నియమాలు పాటించేలా జాగ్రతలు తీసుకోవాలన్నారు.పాఠశాలలో తప్పనిసరిగా అగ్నిమాపక భద్రత చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాల భవనాలు పూర్తి భద్రతతో ఉండాలన్నారు.సేవ దృక్పథంతో పాఠశాలలు నడపాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.విద్యార్థులకు జీవిత సవాళ్లను ఎదుర్కోవడానికి మరియు మంచి పౌరులుగా మారడానికి సహాయపడే నైతిక విలువలను అందించడం,అలవర్చుకోవం మరియు పొందడం ఉపాధ్యాయునికి చాలా ముఖ్యం అన్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు వారి సహజమైన సామర్థ్యాలను మరియు ప్రతిభను ఉపయోగించుకోవడానికి మరియు జీవితాన్ని గడపడానికి బోధించే బోధన శైలిని అవలంబించాలి అన్నారు.



## హిందువుల పై దాడులను ఆపాలి - హిందూ ఐక్య వేదిక

**సిద్ధిపేట , (డైలీ రిపోర్ట్) , డిసెంబర్ 04 :**బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే ఆపాలని హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. హిందువుల జోలికి వేస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. బుధవారం నాడు సిద్ధిపేట పాత బస్టాండ్ దగ్గర బంగ్లాదేశ్ హిందువులకు మద్దతుగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బంగ్లా ప్రభుత్వం అరెస్ట్ చేసిన ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ ను జైలు నుంచి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ లోని హిందువులు , ఇతర మైనార్టీల పై ఇస్లామిక్ మత ఛాందసవాదుల దాడులతో పెట్రేగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు చేస్తూ అమాయకులను చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్లామిక్ దోపిడీలు, దహనాలు , అమానవీయ దౌర్జన్యాలు అత్యంత ఆందోళనకరమైనవన్నారు. ఈ చర్యలను హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. హిందువుల ఊచకోత , దాడులను ఆపాల్సిన బంగ్లాదేశ్ ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. బంగ్లాదేశ్ లోని హిందువుల స్వీయ రక్షణ కోసం ప్రజాస్వామ్య మార్గాలద్వారా లేవనెత్తిన గొంతును అణచివేస్తున్నారని ఆరోపించారు. శాంతియుత నిరసనల్లో హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ ను బంగ్లాదేశ్ ప్రభుత్వం జైలుకు పంపడం అన్యాయమని ఖండించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ , వీరశైవ బలిజ సంఘం , వికాస తరంగిని , భగవత్ గీత్ సంఘం, బార్ అసోసియేషన్, రామచంద్ర మిషన్,వనవాస సంఘం , సుందర సత్సంఘం , ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులలు పాల్గొన్నారు.



## చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయం సాధించిన మొత్తుకుపల్లి మహిపాల్

### యువకులు నాపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు ధన్యవాదాలు

**శంకర్పల్లి డిసెంబర్ 04:(డైలీ రిపోర్ట్):** శంకర్పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామానికి చెందిన మోత్కుపల్లి మహిపాల్ చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మహిపాల్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో నాకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. యువతకు సంబంధించిన ఏ చిన్న సమస్య అయినా, న్యాయం కోసం పోరాటం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని పేర్కొన్నారు.ఈ విజయంతో చేవెళ్ల యూత్ కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత బలపరచడానికి, యువత మధ్య అవగాహన పెంచడానికి నా వంతు కృషి చేస్తానన్నారు.

### దేశవ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్ల సేవలు

## అందుబాటులో ఉన్నాయి

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిన కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, సమాచారం, ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్.**



**ఢిల్లీ / ఏలూరు, డిసెంబరు 4:(డైలీ రిపోర్ట్):** దేశ వ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్ల సేవలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, సమాచారం, ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్ సభలో ప్రకటించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. వంద వందే భారత్ రైళ్ల టెండర్ ప్రక్రియ రద్దు వెనుక కారణాలేంటని, టెండర్లు రద్దు చేయడం వల్ల 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన దేశీయ రైలు పరిశ్రమ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందా అని ఎంపీ ప్రశ్నించారు. టెండర్లు రద్దు చేయడం వల్ల కొత్త రైళ్ల సేకరణలో మరింత జాప్యం, అడ్డంకులు ఏర్పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని ఎంపీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రయాణీకులకు మెరుగైన ప్రయాణం అనుభవాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో భారతీయ రైల్వే తొలిసారిగా దేశీయంగా తయారు చేసిన సెమీ-హై స్పీడ్ వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. ఆధునిక కోచ్‌లు, అధునాతన భద్రతా లక్షణాలు, ప్రయాణీకుల సౌకర్యాలతో 2024 నవంబర్ 21 నాటికి భారతీయ రైల్వేల బ్రాడ్ గేజ్ (బి.జి.) ఎలక్ట్రిఫైడ్ నెట్‌వర్క్‌లో 136 వందే భారత్ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయని, వందే భారత్ చైర్ కార్ రేక్‌ల తయారీ పురోగతిలో ఉందని బదులిచ్చారు.అంతేకాకుండా దీర్ఘ, మధ్యస్థ అంతర్-రాష్ట్ర ప్రయాణాలకు వందే భారత్ స్లీపర్ రైళ్లను కూడా ప్రవేశ పెడుతున్నామని, ప్రస్తుతం 10 వందే భారత్ స్లీపర్ రైళ్లు తయారీలో ఉన్నాయని, భారతీయ రైల్వేలు 50 వందే భారత్ స్లీపర్ స్లీపర్ రేక్‌ల ఉత్పత్తికి కూడా ఏర్పాటు చేసిందని, అదనంగా 200 వందే భారత్ స్లీపర్ రేక్‌ల తయారీకి సంబంధించిన కాంట్రాక్టులు కూడా టెక్నాలజీ పార్టనర్స్‌కు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

## కేసీఆర్ సినిమా హీరో రాకేష్ కు మరకత శివాలయానికి ఆహ్వానించిన చైర్మన్ దయాకర రాజు స్వామి



**శంకర్‌పల్లి డిసెంబర్ 04:(డైలీ రిపోర్ట్):** కేశవ్ చంద్ర రమావత్ సినిమా (కేసీఆర్) హీరో జబర్దస్త్ రాకింగ్ స్టార్ రాకేష్, నటి సుజాత దంపతులను మరకత శివాలయ ఆల్ ఇండియా చైర్మన్ దయాకర్ రాజు స్వామి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చైర్మన్ దయాకర్ స్వామి హీరోకు మరకత శివాలయ చిత్రపటాన్ని బహుకరించి మరకత శివాలయానికి ఆహ్వానించారు. మరకత శివాలయానికి తప్పకుండా వస్తానని హీరో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రిటైర్డ్ డిసిపి సుంకర సత్యనారాయణ ఉన్నారు.


# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తుంది: చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య




**శంకర్‌పల్లి డిసెంబర్ 04:(డైలీ రిపోర్ట్):** పొదుపు గ్రూపు మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రూ. 1.95 కోట్ల రూపాయల చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ మహిళా సంఘాలుప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ పిల్లలను బాగా చదివించి అభివృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా ప్రభుత్వం ఇచ్చే రుణాల ద్వారా స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధిలోకి రావాలని సూచించారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ చంద్రమౌళి, మాజీ సర్పంచ్ ప్రకాష్, కో ఆప్షన్ సభ్యుడు మహమూద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నేడు శంకర్‌పల్లి సాయిబాబా ఆలయంలో 13వ వార్షికోత్సవ ఉత్సవాలు

**శంకర్పల్లి డిసెంబర్ 04:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి పట్టణ పరిధిలో గల సాయిబాబా ఆలయంలో 13వ వార్షికోత్సవ ఉత్సవాలు జరుగుతాయని షిరిడి సాయి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణ, మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, సాయినాథుడిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించగలరని వారు కోరారు. మాజీ జెడ్పిటిసి కళావతి విట్టలయ్య దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు.



# ఘనంగా ముగింపు వేడుకలు

**7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహణ**

**9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ.. లక్ష మందితో సభ**

**కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశం**

**విజయోత్సవాలపై అధికారులతో సమీక్ష**



హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ నగరంలో ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. వేడుకల ఏర్పాట్లపై బుధవారం ఆమె సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చివరి మూడు రోజుల్లో మ్యూజికల్ నైట్‌తో పాటు నగరంలోని ప్రముఖ హోటళ్లు, డ్వాక్రా సంఘాలు, రెస్టారెంట్లు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో 120 స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. భారీ స్థాయిలో డ్రోన్ షో, లేజర్ షో, క్రాకర్స్ షో వంటి కార్యక్రమాలుంటాయన్నారు. 7న వందేమాతరం శ్రీనివాస్, 8న రాహుల్ సిప్లిగంజ్ ఆధ్వర్యంలో సినీ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈ నెల 9న సచివాలయ ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం లక్ష మంది మహిళలతో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. అనంతరం పెద్ద ఎత్తున డ్రోన్ షో, లేజర్ షో, క్రాకర్స్‌షో ఉంటుందని, ఆ తర్వాత సంగీత దర్శకుడు థమన్ ఆధ్వర్యంలో ఐమాక్స్ హెచ్ఎండీఏ మైదానంలో మ్యూజికల్ నైట్ జరుగుతుందని తెలిపారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్ నుంచి పీవీమార్గ్ వరకు ఐదు ప్రాంతాల్లో విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇదే మార్గంలో ఫుడ్ స్టాల్స్, హస్తకళల స్టాల్స్, పలు శాఖల స్టాల్స్‌తో పాటు సెల్ఫీ పాయింట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్యాంక్‌బండ్ నుంచి రాజీవ్ గాంధీ జంక్షన్, సచివాలయం, ఇందిరా గాంధీ విగ్రహం, ఐమాక్స్ జంక్షన్ నుంచి పీవీ నర్సింహారావుమార్గ్ వరకు పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆమె అధికారులను కోరారు. పెద్ద సంఖ్యలో వచ్చే ప్రజలకు తాగునీరు, టాయ్‌లెట్ల సదుపాయం, భద్రత కల్పించడం, పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్టు సీఎస్ వెల్లడించారు.

## పెరిగిపోతున్న శ్రమ దోపిడీ!

**కార్మికులపై పెట్టుబడిదారీ సంక్షోభ ప్రభావం**

**ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన**

**డబ్ల్యూఎఫ్‌టీయూ గౌరవాధ్యక్షుడు జార్జియోస్ మావ్రికోస్**

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉండటంతో కార్మికవర్గం శ్రమ, ఆర్థిక దోపిడీకి గురవుతున్నదని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యూఎఫ్టీయూ) గౌరవాధ్యక్షుడు జార్జియోస్ మావ్రికోస్ ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రపంచ ట్రేడ్ యూనియన్స్ ఉద్యమ చరిత్ర%–% ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు' అనే అంశంపై సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గం టెక్నాలజీ పేరుతో యువతరాన్ని దోపిడీ చేస్తోందని విమర్శించారు. ఈ దోపిడీపై కార్మికవర్గాన్ని చైతన్యపర్చాల్సిన బాధ్యత కార్మిక సంఘాలపైనే ఉందని అన్నారు. దక్షిణ కొరియాలో కార్మికవర్గం ఐక్యంగా పోరాడి గొప్ప విజయాలు సాధించిందని మావ్రికోస్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వలస కార్మికుల సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. నిరుద్యోగం పెరగడంతో తక్కువ జీతాలతో కార్మికులు సామాజిక భద్రతను కోల్పోతున్నారని తెలిపారు. పోరాటం చేయకుండా ఏదీ సాధించలేమన్న విషయాన్ని కార్మికవర్గానికి అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు.కార్మికవర్గ పోరాటాల చరిత్రను తెలుసుకోవడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరిగి, బహుళజాతి సంస్థలను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతారని అభిప్రాయపడ్డారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిచేసినట్టు కనిపిస్తుందని, కానీ పాలస్తీనా వైపు నుంచి చరిత్రను అధ్యయనం చేస్తే ఆ దృష్టికోణం వేరుగా ఉంటుందని తెలిపారు. సామ్రాజ్యవాదం తనకు అనుకూలమైన వాదనను మాత్రమే యువతరానికి, ప్రపంచానికి పరిచయం చేస్తుందని విమర్శించారు.

## మహిళా, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

**కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ లేకపోవడం దారుణం**

**రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే**

**సామాజిక న్యాయ సదస్సులో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



హైదరాబాద్: చట్టసభల్లో మహిళా, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్రానికి డిమాండ్ చేశారు. ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో ఆలిండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్ 3వ జాతీయ సదస్సును బుధవారం నిర్వహించింది. సదస్సులో పాల్గొన్న వద్దిరాజు మాట్లాడుతూ మోదీ ఓబీసీకి చెందిన వారే అయినప్పటికీ న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణలో సామాజిక న్యాయం లభించిందని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అణిచివేతలు, కూల్చివేతలు తప్ప ఏమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు, కులగణన చేయాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు.దేశీయ వినియోగం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా స్థానికంగా సహజ వాయువు ఉత్పత్తులపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని వద్దిరాజు రవిచంద్ర కేంద్రానికి సూచించారు. పార్లమెంట్ కమిటీ హాలులో స్థాయీ సంఘం సమావేశంలో వద్దిరాజుతోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. పెట్రోలియం,సహజ వాయువు ఉత్పత్తులు, వాటి ధరలు, రవాణా, మారెటింగ్ తదితర అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు.



## పోలవరం మండలం కొత్తపట్టిసీమలో పశువైద్యశాల నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టండి

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం.

ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు.



**ఏలూరు, డిసెంబరు 04:(డైలీ రిపోర్ట్ ):** పోలవరం మండలం కొత్తపట్టిసీమలో పశువైద్యశాల నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ను ఆదేశించారు. కొత్తపట్టిసీమలో 1977లో స్థాపించిన పశువైద్యశాల ద్వారా ఆరు పంచాయతీల పరిధిలోని 5 వేల పశువులకు చికిత్స అందిస్తున్నారని, గతంలో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఇటీవల మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించే క్రమంలో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా వెటర్నరీ ఆసుపత్రికి నూతన భవనం మంజూరు చేయాలని పోలవరం ప్రాంత ప్రజల తరపున ఎంపీ మహేష్ కుమార్ మంత్రిని అభ్యర్థించారు. ఎంపీ మహేష్ కుమార్ వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు ఈ మేరకు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. తన విన్నపానికి తక్షణం స్పందించి ఆదేశాలు జారీ చేసిన మంత్రికి ఎంపీ మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రశాంత్ రెడ్డి

**శంకర్‌పల్లి డిసెంబర్ 04:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ప్రశాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఆన్ లైన్ ఓటింగ్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. భారీ మెజారిటీతో గెలిచినట్లు ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ యువజన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, తన గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ మండల, మున్సిపల్ నాయకులకు, యువజన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# రాజకీయ కుట్రతోనే నాపై కేసు

**పంజాగుట్ట స్టేషన్‌లోఎఫ్ఐఆర్‌ను కొట్టేయండి.. హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్**



హైదరాబాద్: తనపై అసత్య ఆరోపణలతో కాంగ్రెస్ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ కుట్రపూరితంగా చేసిన ఫిర్యాదుతో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హైకోర్టులో బుధవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. చక్రధర్‌గౌడ్ కుట్రతోనే పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ చేయించానంటూ తనతోపాటు రాధాకిషన్‌రావు, ఇతరులపై ఇచ్చిన ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ చేయకుండానే పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారని తెలిపారు. కేసులో తనను పోలీసులు అరెస్టు చేస్తే మచ్చలేని తన రాజకీయ జీవితానికి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. ట్యాపింగ్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన చక్రధర్ తర్వాత దానిని ఉపసంహరించుకున్నారని గుర్తు చేశారు. 'చక్రధర్‌గౌడ్ ఫోన్‌ను ట్యాపింగ్ చేయించానని పేరొనడం విడ్డూరం. ఫిర్యాదుదారుడికి హాని కలిగించానని చెప్పడానికి ఆధారాలు లేవు. నేను ప్రజా సమస్యలను పరిషరిస్తూ జనంతో మమేకం అవ్వడంతో ఓర్వలేక చక్రధర్ నిరాధార ఆరోపణలతో ఫిర్యాదు చేశారు. ఎన్నికలో నాపై చిత్తుగా ఓడిపోయారు. నా ఎన్నికను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రజాక్షేత్రంలో ఎదురొనలేక అడ్డదారిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు" అని హరీశ్‌రావు వివరించారు.

**ఆధారరహితమైన ఆరోపణలు**

"సేవా సంస్థ ద్వారా సేవ చేస్తుంటే ఓర్వలేక తాను చక్రధర్‌గౌడ్‌ను బెదిరించానని ఫిర్యాదులో పేరొనడం విస్తుగొల్పుతున్నది. సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి బీజేపీ టికెట్ రాకపోవడంతో బీఎస్పీలో చేరి పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల సమయంలో కూడా బెదిరించానని చెప్పడం ఇంకా దారుణం' అని హరీశ్ పేర్కొన్నారు.పోలీసులు ప్రాథమిక విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా కేసులు నమోదు చేయించి రాజకీయంగా దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని, పగ, ప్రతీకారంతోనే కేసు నమోదు చేశారని హరీశ్‌రావు తెలిపారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రిమినల్ ఫిర్యాదు అన్యాయమని, ఫిర్యాదులో పేర్కొన్న నేరాలతో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. దీనిని రాజకీయంగా ప్రేరేపిత కేసుగా పరిగణించి, ఫిర్యాదును ప్రాథమిక దశలోనే కొట్టేయాలని కోరారు. దీనిపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసు కొనసాగితే చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని కేసులో స్టే మంజూరు చేయాలని, తుది తీర్పులో ఫిర్యాదును కొట్టేయాలి.. అని హరీశ్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707